ప్రజాశక్తి

సోమవారం 3, ఏప్రిల్ 2023 | 5 | శ్రీ సత్యసాయి



చేనేతల రిజర్వేషన్ చట్టాన్ని అమలుచేయాలి

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

చేనేతల 11రకాల రిజర్వేషన్ చట్టాన్ని అమలుచేసేలా చూడాలని చేనేత కార్మికసంఘం నాయకులు టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేష్‌కు విన్నవించారు. యువగళం పాదయాత్రలో భాగంగా చేనేత కార్మికసంఘం రాష్ట్ర ఆధ్యక్షులు పోలారామాంజినేయులు, రాష్ట్రప్రధానకార్యదర్శి జింకాచలపతి, చేనేత కార్మికసంఘం తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటస్వామి, వెంకటనారాయణ తదితరులు లోకేష్‌ను కలిసి చేనేతల సమస్యలను వివరిస్తూ వినతిపత్రాన్ని అందజేశారు. స్పందించిన లోకేశ్ టీడీపీ అధికారంలోకి చేపట్టాక టీడీపీ హయాంలో చేపట్టిన సంక్షేమపథకాలను తిరిగి పునరుద్ధరిస్తామనిహామీ ఇచ్చారు.

నేటి నుంచి పది పరీక్షలు



పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

నేటి నుంచి పదవ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. దీనికి సంబంధించిన ఏర్పాట్లను విద్యాశాఖ పూర్తి చేసింది. అనంతపురం జిల్లా పరిధిలో మొత్తం 139 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిల్లో 35,305 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. పరీక్షలు సజావుగా జరిగేందుకు ఇన్విజిలేటర్ల నియామకం మొదలుకుని, పరీక్ష కేంద్రాల్లో అవసరమైన వసతుల ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆ శాఖ ప్రకటించింది. 2094 మందిని ఇన్విజిలేటర్లుగా నియమించారు.

అగ్రస్థానంలో నిలిపేందుకు కసరత్తు

అనంతపురం జిల్లాను పద తరగతి ఉత్తీర్ణతలో ఈసారి అగ్రభాగాన నిలిపేందుకు అవసరమైన కసరత్తును విద్యాశాఖ చేపట్టింది. జిల్లా కలెక్టరు ఎస్.నాగలక్ష్మి ఆధ్వర్యంలో ఈ ప్రణాళికను అమలు జరిపారు. ప్రధానంగా ప్రభుత్వ పాఠశాలల్లోనూ ఉత్తీర్ణత శాతం పెంపుదల కోసమని అనంత సంకల్పం పేరుతో ప్రణాళిక రూపొందించి విద్యార్థుల చదువులపై ప్రత్యేకమైన దృష్టిని సారించింది. ఏడు రౌండ్లలో పాఠశాల పునరుచ్చరణ, వీక్లి పరీక్షలు, అనంతరం ఇళ్ల వద్ద చదువుతున్నారా లేదా అన్న అంశాలను పరిశీలించారు. గతేడాది జరిగిన పరీక్షల్లో అనంతపురం జిల్లా చివరి స్థానంలో నిలిచింది. ఈసారి మెరుగుపరిచేందుకు ఈ ప్రణాళికను రూపొందించి అమలు జరిపే ప్రయత్నం చేశారు.

ఆరుగురు అంధ విద్యార్థులు నేరుగా పరీక్షకు

ఈ ఏడాది జరిగే పదవ తరగతి పరీక్షల్లో ఆరుగురు అంధ విద్యార్థులు ఎవరి సహకారం లేకుండా తమ ల్యాప్ ట్యాప్ ద్వారా వారే స్వయంగా పరీక్ష రాయనున్నారు. ఇది రాష్ట్రంలోనే తొలిసారి కావడం గమనార్హం. సాధారణంగా అయితే అంధ విద్యార్థులు చెబుతుంటే వారికంటే తక్కువ తరగతి అంటే తొమ్మిద వ తరగతి విద్యార్థులు పరీక్ష రాస్తారు. కాని ఆర్డీటీలోని ఇన్లివ్‌జీవ్ పాఠశాలల్లో చదువుతున్న ఆరుగురు విద్యార్థినులు నేరుగా ల్యాప్‌టాప్‌లో పరీక్ష రాయనున్నారు. దీనికి అవసరమైన అనుమతులను ప్రభుత్వమిచ్చింది. రాప్తాడులోని పదవ తరగతి పరీక్ష కేంద్రంలో వీరు పరీక్ష రాయనున్నారు.

'అనంత' సంకల్పంపై విమర్శలు

అనంత సంకల్పం పేరుతో విద్యార్థులపై ఒత్తిడి పెంచే విధంగా అధికారులు వ్యవహించారంటూ కొంతమంది విద్యావంతుల నుంచి విమర్శలు సైతం వచ్చాయి. గతేడాది పది పరీక్షల్లో ఉత్తీర్ణత తగ్గిందని, ఈ ఏడాది ఉత్తీర్ణత శాతం పెంచాలంటూ ఇళ్ల వద్దకెళ్లి ఉపాధ్యాయులు తనిఖీలు చేయడం, ట్యాబుల్లో ఎన్ని గంటలు చూసారని ఉపాధ్యాయుల చేత పరీక్షింపచేయడం వంటివి విద్యార్థులపై మానసిక ఒత్తిడి పెంచే ప్రయత్నం చేయడమేనని చెబుతున్నారు. వారిని స్వేచ్ఛగా చదువుకోనివ్వాలని, కార్పొరేట్ తరహాలో ప్రభుత్వ అధికారులు ఒత్తిడి పెంచే విధంగా వ్యవహరించడం సరైంది కాదని అంటున్నారు.



సత్యసాయి జిల్లా ఐసిడిఎస్ పీడీ లక్ష్మీకుమారి

సజావుగా పౌష్టికాహారం పంపిణీ

శ్రీసత్యసాయి జిల్లా ఐసిడిఎస్ పీడీ లక్ష్మీకుమారి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్



శ్రీ సత్యసాయి జిల్లాలో పౌష్టికాహార పంపిణీ సక్రమంగా సాగుతోందని, ఎలాంటి అలసత్వం వహించకుండా ఎప్పటికప్పుడు అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ జరుగుతోందని ఐసిడిఎస్ పీడీ లక్ష్మీకుమారి పేర్కొన్నారు. ఆదివారం ఆమె ప్రజాశక్తితో ముఖాముఖి మాట్లాడారు. ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజా ప్రయోజన కార్యక్రమాలు..భవిష్యత్తులో చేపట్టబోవు పనుల గురించి కూలంకుశంగా వివరించారు.

ప్రశ్న : శ్రీ సత్యసాయి జిల్లాలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఏయే కార్యక్రమాలు చేపడుతున్నారు.?

పీడీ : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ప్రజాప్రయోజన కార్యక్రమాలు ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నాం. శ్రీ సత్యసాయి జిల్లాలో 32 మండలాల్లో ప్రాజెక్టు పరిధిలో 2824 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి ద్వారా చిన్నారులకు, గర్భిణులకు బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్నాం.

ప్రశ్న : ఫౌండేషన్ స్కూలు ద్వారా ప్రయోజనాలు ఏమైనా ఉన్నాయా?

పీడీ : ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన ఫౌండేషన్ స్కూల్ ద్వారా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలను ఫౌండేషన్ స్కూల్‌గా మార్చి ప్రాథమిక పాఠశాలల్లో గదులు లభ్యమున్నచోట స్కూలు ఏర్పాటు చేస్తున్నాం. ఈ సంవత్సరం పి 1, పి2 పుస్తకాలను అందించి బోధిస్తున్నాం. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో కూడా బోధనలు అందుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఉన్న 2824 అంగన్‌వాడీ కేంద్రాల్లో మూడు ఏళ్ల వయస్సు చిన్నారులు 47,180 మంది ఉన్నారు. ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో కొన్నింటిని మినహాయిస్తే 113 కేంద్రాలను 93 పాఠశాలల్లో విలీనం చేశాం. మిగిలినవి అలాగే కొనసాగుతున్నాయి.

ప్రశ్న : అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మిస్తున్నారా?

పీడీ : కొన్ని సొంతభవనాల్లో మరికొన్ని అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నాం. ఇప్పటివరకు ఉమ్మడి అనంతపురం జిల్లాలో అంగన్‌వాడీ కొత్త భవనాల నిర్మాణాలకు ప్రభుత్వం నుంచి అనుమతులు మంజూరయ్యాయి. నిర్మాణాలు కూడా చేపట్టారు. గతంలో కొన్నింటిని పూర్తి చేశారు. కొన్ని కేంద్రాలకు గ్రామీణ, పట్టణ, ప్రాంతాల్లో స్థలం లభ్యత కాకపోవడం వంటి కారణాల చేత నిర్మాణాల్లో జాప్యం జరుగుతోంది. ఇప్పటికే కొన్ని భవనాలు పూర్తి అయి అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహిస్తున్నారు. మరికొన్ని అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నాం.

ప్రశ్న : అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం అందించడంలో లోపాలపై మీ అభిప్రాయం ?

పీడీ : చిన్నారులు, గర్భిణులు బాలింతలకు చిన్నారులకు పౌష్టికాహారం అందించడంలో సదరు కాంట్రాక్టర్లు చేతివాటం ప్రదర్శించినట్లు గతంలో తమ దృష్టికి వచ్చిందన్నారు. జిల్లాలో కొన్నిచోట్ల అధికారులతో పర్యవేక్షణ చేపట్టి అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకున్నాం. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడుతున్నాం. చిన్నారులకు, గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ పర్యవేక్షణ చేసేందుకు ఇప్పుడు అధికారులు చాలామంది ఉన్నారు. వారి ద్వారా ఎలాంటి అవకతవకలు జరక్కుండా చర్యలు చేపడతాం. ఏడు నెలల నుండి ఆరు సంవత్సరాల లోపు చిన్నారులకు పాలు, గుడ్లు అందజేస్తున్నాం. వైఎస్సార్ సంపూర్ణ భోజన పథకం ద్వారా జిల్లా వ్యాప్తంగా 15910 మంది గర్భిణులు, 4952 మంది బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం తీసుకుంటున్నారు. ఏడు నెలల నుండి మూడు సంవత్సరాలలోపు 64530 మంది చిన్నారులకు ప్రతి నెలా బాలామృతం ప్యాకెట్లు అందజేస్తున్నాం.

ప్రశ్న : అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పోస్టుల నియామకంలో అవకతవకలపై మీ అభిప్రాయం ?

పీడీ : అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పోస్టుల నియామకం కోసం అర్హత పరీక్షను ఏపీపీఎస్ ద్వారా నిర్వహించారు. పరీక్షల్లో ఎలాంటి అవకతవకలు జరగలేదు. అత్యధిక మార్కులు సంపాదించిన ముగ్గురు సభ్యులను తీసుకొని వారికి ఇంటర్వ్యూలు నిర్వహించి ఇద్దరిని ఎంపిక చేశారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణలోనే వీటన్నింటిని నిర్వహించాం. ఎలాంటి అవకతవకలకూ తావు లేకుండా సూపర్‌వైజర్ పోస్టుల నియామకం జరిగింది.

చేనేత కార్మికులను ఆదుకుంటాం..

మగ్గం ఉన్న ప్రతి కార్మికునికి 200 యూనిట్లు ఉచిత విద్యుత్

యువగళం పాదయాత్రలో నారా లోకేష్

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్, బత్తలపల్లి

టిడిపి అధికారంలోకి రాగానే చేనేత కార్మికులను ఆదుకుంటామని, మగ్గం ఉన్న ప్రతి కార్మికునికి 200 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పేర్కొన్నారు. నారా లోకేష్ 58వ రోజు యువగళం పాదయాత్ర ఆదివారం ధర్మవరం పట్టణం నుంచి ప్రారంభమైంది. స్థానిక మార్కెట్ యార్డ్ సమీపంలోని సిబిఎన్ కల్యాణమండపంలో చేనేతల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. గొట్లూరులో కురుబ సామాజిక వర్గీయులతో ఆయన భేటీ అయ్యారు. నాగలూరులో బోయ కులస్తులతో సమావేశమయ్యారు. వేల్పుమడుగు వద్ద పొడరాళ్లపల్లి వాసులతో మాట్లాడారు. బత్తలపల్లిలో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నారా లోకేష్ మాట్లాడుతూ.. ధర్మవరం చేనేతకు పుట్టినిల్లు అన్నారు. దేశంలోనే ధర్మవరం పట్టుచీరలకు మంచి పేరు ఉందన్నారు. అయితే వైసిపి పాలనలో చేనేత కార్మికులు గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నారని అన్నారు. ఒక్క ధర్మవరం పట్టణంలోనే 53 మంది చేనేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకోవడం బాధాకరమన్నారు. బాధిత కుటుంబాలను వైసిపి ప్రభుత్వం ఆదుకోలేదన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చాక చేనేత కార్మికుల కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. చేనేత వస్త్రాలపై జిఎస్‌టి వేయాలని టిడిపి ప్రభుత్వ హయాంలోనే కేంద్రం ప్రతిపాదన పెట్టిందన్నారు. అయితే అప్పుడు కేంద్రంతో మాట్లాడి పక్కన పెట్టించామని తెలిపారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక చేనేత వస్త్రాలపై జిఎస్‌టి వసూలు చేస్తున్నారన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే చేనేత వస్త్రాలపై జిఎస్‌టిని ఎత్తివేయించడానికి కృషి చేస్తామని చెప్పారు. టిడిపి అధికారంలోకి వస్తే సంక్షేమ కార్యక్రమాలు రద్దు చేస్తారని జగన్ వాలంటీర్లతో ప్రచారం చేయిస్తున్నాడన్నారు. రాష్ట్రానికి సంక్షేమాన్ని పరిచయం చేసిందే టిడిపి అన్నారు. జగన్ పాలనలో ఖైదీలకు కల్పించే సౌకర్యాలు కూడా విద్యార్థులకు కల్పించడంలేదన్నారు. ఖైదీలకు నెలకు రూ.2 వేలు ఖర్చు చేస్తుంటే విద్యార్థులకు కేవలం రూ.వెయ్య మాత్రమే మెస్ ఛార్జీలు ఇస్తున్నారని విమర్శించారు. నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ ఇవ్వలేదన్నారు. గ్రూప్ 2, డిఎస్‌సి లేదన్నారు. వైసిపి ప్రభుత్వం రైతులను ఆదుకోకపోగా వ్యవసాయ బోర్లకు మీటర్లు పెట్టి ఉరితాళ్లు బిగిస్తోందన్నారు. ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అరాచకాల గురించి తెలుసుకున్నాక ఆయన కేతిరెడ్డి కాదు.. నంబర్ వన్ కేటుగాడు అని అర్థమైందని విమర్శించారు. టిడిపి హయాంలో ధర్మవరంలో ధర్మం ఉండేదని అన్నారు. కేటుగాడు ఎమ్మెల్యే అయ్యాక ధర్మవరంలో మొత్తం అధర్మమే అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పరిటాల సునీత, టిడిపి సత్యసాయి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారధి, పరిటాల శ్రీరాం, కందికుంట ప్రసాద్, బండారు శ్రావణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.



హాజరైన టిడిపి నాయకులు, కార్యకర్తలు



బత్తలపల్లి బహిరంగ సభలో మాట్లాడుతున్న నారా లోకేష్

నారా లోకేష్‌కు చేనేత పట్టు వస్త్రాలు అందజేత

నారా లోకేష్‌కు ధర్మవరం తొగట వీర క్షత్రియులు వారి కులదేవత చౌడేశ్వరిదేవి చిత్రంతో ఉన్న పట్టు వస్త్రాన్ని లోకేష్‌కు అందజేశారు. 40 ఏళ్ళుగా చేనేతలకు అండదండగా నిలుస్తున్న టిడిపి కుటుంబానికి పట్టుచీరలు, పంచెలు, కండువాలు అందజేశారు. తొగటవీర క్షత్రియులకు లోకేష్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

ప్రభుత్వం నుంచి పరిహారం ఇప్పించండి

ప్రభుత్వం నుంచి పరిహారాన్ని ఇప్పించి న్యాయం చేయాలని ముదిగుబ్బ మండలం పొడరాళ్లపల్లి జిల్లేడు బండ ప్రాజెక్టు ముంపు రైతులు లోకేష్‌ను కలిసి విన్నవించారు. 2003లో చంద్రబాబు నాయుడు సిఎంగా ఉన్న సమయంలో ఎక్కువగా భూములు ముంపునకు గురికాకుండా 0.48 సామర్థ్యంతో ప్రాజెక్టుకు అనుమతి ఇచ్చారన్నారు. దీంతో మిగిలిన సాగుభూమిలో మామిడి, చీని, జామ, పూల మొక్కలు పెంచుకుని జీవనం సాగిస్తున్నామన్నారు. అయితే వైసిసి ప్రభుత్వం ఈ ప్రాజెక్టును 2.48 టిఎంసిలకు పెంచుతూ అనుమతులు మంజూరు చేసిందన్నారు. దీనివల్ల దాదాపు 1500 ఎకరాలు ముంపునకు గురవుతుందన్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి భూ సేకరణపై రైతులకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదన్నారు. ప్రస్తుతం ఉన్న మార్కెట్ ధర ప్రకారం ఎకరాకు రూ.30 లక్షలు పరిహారం చెల్లించేలా చూడాలని రైతులు నారా లోకేష్‌ను కోరారు. స్పందించిన లోకేష్ రాష్ట్రంలో సిఎం జగన్ ప్రభుత్వానికి భూములు లాక్కోవడంపై ఉన్న శ్రద్ధ నిర్వాసితులకు పరిహారం అందించడంలో చూపలేదన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాల్సి ఉంటుందన్నారు. దీనిపై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామన్నారు. న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చండి

సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వాల్మీకి బోయలను ఇతర రాష్ట్రాల మాదిరిగా ఎస్టీ జాబితాలోకి చేర్చేలా కృషిచేయాలని వాల్మీకి బోయ సంక్షేమ సంఘం ప్రతినిధులు లోకేష్‌ను కలిసి విన్నవించారు. రాష్ట్రంలో 40 లక్షల మందికి పైగా వాల్మీకులు, బోయలు ఉన్నారని కులవృత్తి లేక కూలిపనులు, చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. వాల్మీకి ఫెడరేషన్ ద్వారా సామాజిక వర్గీయులకు బడ్జెట్లో ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే దామాషా పద్ధతిన వాల్మీకి బోయ కార్పొరేషన్‌కు నిధులు కేటాయిస్తామని లోకేష్ వారికి హామీ ఇచ్చారు.

నేడు పరిగి మండలానికి ఫుడ్ కమిషన్ రాక

ప్రజాశక్తి - పరిగి

మండలంలో పాఠశాలలను, డీలర్ షాపులను, అంగన్వాడీ కేంద్రాలను ఫుడ్ కమిషన్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి సోమవారం తనిఖీ చేయనున్నారు. ఇప్పటికే సంబంధిత అధికారులు రూట్ మ్యాప్ లను షాపుల వివరాలను సంబంధిత శాఖ అధికారులకు అందజేసినట్లు సమాచారం. మండలంలో ఇటు రేషన్ షాపులలో అటు పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన ఏజెన్సీలలో ఎన్నో మార్లు అక్రమాలు జరిగినట్లు బయటపడిన సర్దుకుపోయిన అధికారులు ఫుడ్‌కమిషనర్ చైర్మన్ తనిఖీ నేపథ్యంతో దిక్కుతోచని స్థితిలో పడ్డట్లు తెలుస్తోంది. ఆయా శాఖల అధికారులు సైతం ఇటు పాఠశాల మధ్యాహ్న భోజన నిర్వాహకులతో, రెవెన్యూ శాఖ అధికారులు రేషన్ షాప్ డీలర్లతో సమావేశాలు నిర్వహించి ఎటువంటి లోటుబాట్లు లేకుండా ముందస్తు సమాచారం ఇచ్చి అప్రమత్తం చేసినట్లు విశ్వసనీయ సమాచారం. మరికొందరు డీలర్లు సంబంధిత రెవెన్యూ అధికారులతో తమ డీలర్ షాపులలో తనిఖీలు జరగకుండా రూట్ మ్యాప్ ను మార్చమని నాయకుల ద్వారా ఒత్తిడి తెచ్చినట్లు తెలిసింది. ఫుడ్‌కమిషన్ చైర్మన్ పర్యటించిన కొన్ని మండలాలలో పలువురు అధికారులపైనే కాకుండా ఏజెన్సీలు, డీలర్ షాప్‌లు, అంగన్వాడీలపై చర్యలు తీసుకున్న దాఖలాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఫుడ్ కమిషన్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి మండల పర్యటనలో ఎలా ఉంటుందోన్న ఆందోళనలు అధికారుల్లో నెలకొన్నాయి.

పాదయాత్రకు ఆదరణ లేకే లోకేష్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు

వైసిసి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య

ప్రజాశక్తి-రాయదుర్గం

యువగళం పేరిట నారా లోకేష్ చేపట్టిన పాదయాత్రకు ప్రజల్లో ఆదరణ లేకపోవడంతో వల్లే వైసిపి నాయకులు, కార్యకర్తలపై రెచ్చగొట్టే ధోరణిలో వారు వ్యవహరిస్తున్నారని వైసిపి అనంతపురం జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య అన్నారు. ఆదివారం రాయదుర్గంలోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నరసింహయ్య విప్ కాపు రామచంద్రారెడ్డి, జెడ్‌పి ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మతో కలిసి విలేకరులతో మాట్లాడారు. పాదయాత్ర సందర్భంగా లోకేష్ ముఖ్యమంత్రి జగన్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీపై అడ్డగోలు ఆరోపణలు చేసినా ప్రజల నుండి స్పందన లేకపోవడంతో పెయిడ్ ఆర్టిస్టులను, రోజు కూలీలను యాత్రలో ఉపయోగించి ప్రజలను మభ్యపెడుతున్నారని ఎద్దేవా చేశారు. పాదయాత్ర అట్టర్ ఫ్లాప్ అయిందన్నారు. మీడియా దృష్టిని ఆకర్షించేందుకు ప్రశాంతమైన జిల్లాలో టిడిపి కార్యకర్తలను రెచ్చగొట్టి, శాంతిభద్రతలకు భంగం కలిగే విధంగా లోకేష్ వ్యవహరిస్తున్నారని విమర్శించారు. పుట్టపర్తిలో శనివారం జరిగిన అల్లర్లు అందుకు నిదర్శనమన్నారు. రాప్తాడులో శ్రీనివాస్ అనే కార్యకర్త దారుణ హత్యకు గురయ్యారని తెలిపారు. లోకేష్ మూర్ఖుడని, తాను ఫ్యాక్షనిస్ట్‌గా మారుతానని, 20 కేసులు ఉంటేనే దగ్గరకు రమ్మని చెబుతున్నట్లు వ్యాఖ్యానించారు. కరువు లేదా ప్రజా సమస్యలు ఉంటే ఎవరైనా పాదయాత్ర చేస్తారన్నారు. రాష్ట్రంలో సుభిక్షమైన వాతావరణం నెలకొన్నప్పుడు లోకేష్ పాదయాత్ర చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. లోకేష్ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలన్నారు. మండలి ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ ద్వారా నాలుగు సీట్లను గెలవగానే రాష్ట్రంలోని ప్రజలందరూ ఏకపక్షంగా టిడిపికి తీర్పు ఇచ్చారని భ్రమ పడుతున్నారని అన్నారు. జెడ్‌పి ఛైర్మన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా జగన్ రాష్ట్రంలో పాలన సాగిస్తున్నారన్నారు. చంద్రబాబు, లోకేష్ దుష్ప్రచారం చేయడం, యువగళం పేరిట రెచ్చగొట్టే ధోరణి అవలంభించడం సరికాదన్నారు. యువతను, మహిళలను, పేదలను మోసం చేసింది మీరు కాదా, యాత్రకు స్పందన లేక రణరంగంగా మార్చింది మీరు కాదా అని ప్రశ్నించారు. విప్ కాపు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ పప్పు 'లోకేష్ యువగళం పేరిట పాదయాత్ర చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కనీసం వార్డు మెంబరుగా కూడా గెలవలేని లోకేష్ చేపట్టిన పాదయాత్రకు జనం లేకపోగా, కూలీ ఇచ్చి, సెల్ఫీలు తీయించి, డబ్బు వెదజల్లి యాత్ర చేస్తున్నారని ఎద్దేవా చేశారు. అమరావతి పాదయాత్ర కూడా విఫలం అయిందని అన్నారు. టిడిపికి కాలం చెల్లిందని, ఇప్పటికైనా మారాలన్నారు. లేకుంటే వచ్చే ఐదేళ్లలో తామేమిటో చేసి చూపుతామని హెచ్చరించారు. లోకేష్ చేపట్టిన యువగళం యాత్ర డ్రామా అని, డబ్బాయాత్ర అని వ్యాఖ్యానించారు. విలేకరుల సమావేశంలో ఎపిఐఐసి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, రాయదుర్గం ఎంపిపి విద్యావతి, జెడ్పిటిసి సభ్యులు మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల అభివృద్ధికి సహకరించండి

ప్రజాశక్తి-హిందూపురం

అన్ని విధాలా వెనుకబడిన ముస్లీం మైనార్టీల అభివృద్ధికి టిడిపి తరపున అన్ని విధాలా సహకరించాలని టిడిపి జాతీయ కార్యదర్శి నారాలోకేష్‌ను ముస్లిం నగారా, టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షులు ఉమర్ ఫారూక్ ఖాన్ కోరారు. యువగళం పాదయాత్ర చేస్తున్న నారా లోకేష్‌ను ధర్మవరంలో కలిసిన ఆయన ఫ్రీడమ్ ఫైటర్ టిప్పు సుల్తాన్ షహీద్ జాతీయ పురస్కారం అందించారు. ముస్లిం మైనారిటీ లకు విద్య, ఉద్యోగ, రాజకీయ, సామాజిక రంగాల్లో జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కేటాయింపుల కోసం అసెంబ్లీలో తీర్మానం ప్రవేశ పెట్టలని కోరుతు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్రఅధ్యక్షులు హనుమంతు, ధర్మవరం నాగూర్ హుసేన్, గోరంట్ల మైనారిటీ నాయకుడు ఉమర్, గుంతకల్లు మైనారిటీ నాయకులు రంజాన్, టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ నాయకులు బిలాల్ అమీన్, హుమాయుమనిజం నాయకులు అజమతుల్లా ఖాన్, నయాజ్ తదితరులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీకి తరలిన నాయకులు

నల్లచెరువు : ఈనెల 5న తలపెట్టిన ఛలో ఢిల్లీ కార్యక్రమంలో పాల్గొనడానికి మండల కార్యదర్శి అధ్వర్యంలో మండల భవన నిర్మాణ కార్మిక సంఘం తరపున నల్లచెరువు మండలం నుండి నాయకులు డిల్లీకి బయలుదేరి వెళ్ళారు. ఈ నెల 5 వ తేదీన జరిగే ధర్నా కార్యక్రమంలో పాల్గొనడానికి మండలానికి చెందిన రామకృష్ణ, బాబయ్య, సదా శివ, నాగిరెడ్డి, క్రిష్టప్ప, రాములమ్మ, ప్యాయల ఆంజనేయులు తదితరులు వెళ్లారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

'పది' పైనే గురి

మెరుగైన ఫలితాలే లక్ష్యంగా ఉపాధ్యాయుల కార్యాచరణ

ప్రజాశక్తి - కదిరి టౌన్

కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో వంద శాతం ఫలితాలు సాధించాలన్న లక్ష్యంతో ఉన్నతాధికారులు అనంత సంకల్పం తలపెట్టారు. మెరుగైన ఫలితాలు లక్ష్యంగా లక్ష్యసాధనకు అనుగుణంగా ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. ప్రతి ఏడుగురు విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుని చొప్పున విద్యార్థుల ఇళ్ల వద్దకు రాత్రి వేళల్లో వెళ్లి వారి రోజువారి కార్యాచరణను పరిశీలించి అర్థం కాని సబ్జెక్టులను వివరిస్తూ మెరుగైన ఫలితాలే లక్ష్యంగా కార్యచరణ చేస్తూ సన్నద్ధం చేశారు. గతేడాతో పోలిస్తే ఈ ఏడాదిలో ప్రభుత్వ పాఠశాలలో వంద శాతం ఫలితాలు లక్ష్యంగా ప్రధానోపాధ్యాయులు, సబ్జెక్టులు వారిగా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించారు. కదిరి పట్టణంలోని వీవర్స్ కాలనీ మున్సిపల్ హై స్కూల్, కుటాగుల మున్సిపల్ హై స్కూల్ నందు దాదాపు ఒక స్కూల్ నందు 140 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధిస్తేనే ఉన్నత చదువులకు ఆది దోహదపడుతుంది. అందుకు అనుగుణంగా ఉపాధ్యాయులు విద్యార్థుల దశ దిశా మార్చడానికి తమవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. 140 మంది విద్యార్థులకు గాను 20 గ్రూపులుగా విభజించి ప్రతి ఏడుగురు విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుని లేదా ఉపాధ్యాయురాలిని నియమించి వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ ఎప్పటికప్పుడు ప్రతి సబ్జెక్టు పైన మెలకువలు తెలియపరుస్తూ విద్యార్థులు ప్రతి సబ్జెక్టు పైన పట్టు సాధించేలా దిశా నిర్దేశం చేస్తున్నారు.



తరగతి గదిలో చదువుకుంటున్న విద్యార్థులు (ఫైల్ ఫొటో)

నేటి నుండి పద పరీక్షలు : పదవ తరగతి పరీక్షలు ఉదయం 9:30 నుండి మధ్యాహ్నం 12: 45 వరకు నిర్వహించనున్నారు. అందుకు తగిన ఏర్పాట్లును అధికారులు పూర్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలలో వందశాతం ఫలితాలు సాధించడానక అందుకు తగినట్టుగా ప్రతి విద్యార్థి పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని వీవర్స్ కాలనీ మున్సిపల్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు నాగరాజు చెప్పారు. ఏ సబ్జెక్టు కు ఆ సబ్జెక్టు టీచర్లను కేటాయించి మాదిరి ప్రశ్నాపత్రాలు సిద్ధం చేసి రోజువారీ మాదిరి పరీక్షలు ప్రతిరోజు నిర్వహించామన్నారు. ప్రతి విద్యార్థి మెరుగైన ఫలితాలు సాధించడమే తమముందున్న ప్రధాన లక్ష్యమని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని సంకల్పంతో ప్రతి విద్యార్థిన సన్నద్ధం చేశామని సైన్సు ఉపాధ్యాయిని హరిత తెలిపారు.

చేనేత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న పోలా రామాంజినేయులు

సోమందేపల్లి : చేనేత కార్మికులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని ఎపి చేనేత కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షులు పోలా రామాంజినేయులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని పాత ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో చేనేత కార్మిక సంఘ రాష్ట్ర అధ్యక్షులు పోలా రామాంజనేయులు, ఏపీ చేనేత కార్మిక సంఘం మండల కార్యదర్శి రాజగోపాల్ ఆధ్వర్యంలో నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా ఎస్ చాంద్‌బాషా, ఉపాధ్యక్షులుగా ఎం గోవిందప్ప,కమిటీ సభ్యులుగా ఓబులేసు, రామాంజనేయులు, గంగరాజు, శీనా నాయక్, మాజీ వార్డ్ మెంబర్ వెంకటేష్, నాగరాజు, సతీష్‌ను ఎన్నుకున్నారు. ఈసందర్భంగా చేనేత కార్మిక సంఘ రాష్ట్ర అధ్యక్షులు పోలా రామాంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వం చేనేతలను ఆదుకోవాలన్నారు. 50 సంవత్సరాలకే పింఛన్ అందిస్తున్నామని చెప్పిన ముఖ్యమంత్రి హామీ నేటికీ అమలుకు నోచుకోలేదన్నారు. చేనేతకు జీఎస్టీని పూర్తిగా మినహాయించి చేనేతను ఆదుకోవాలని చేనేతకు కేటాయించిన 11 రకాల రిజర్వేషన్ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మికులు నాగమణి, బి ప్రమీల, జి ప్రభాకర్, పోతులయ్య,, ఎస్ శ్రీరాములు, పి, ప్రకాష్ పార్టీ సభ్యులు, శ్రీకాంత్, మాబు, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-హిందూపురం

ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య శ్రీ సత్య సాయి జిల్లా కార్యవర్గాన్ని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పివి. వర్రప్రసాదరావు ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం పట్టణంలోని టీచర్స్ కాలనీలో నిర్వహించిన సేవా సమాఖ్య సమావేశంలో కమిటీని ఏర్పాటు చేశారు. జిల్లా అధ్యక్షులుగా దేశాయ్ మురళీ, ప్రధానకార్యదర్శిగా పరిగి ప్రవీణ్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. మిగిలిన కార్యవర్గాన్ని ఎంపిక చేసి, త్వరలో ప్రమాణస్వీకార కార్యక్రమం చేపడతామని వారు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణరావు, కొటిపి నాగేశ్వరావు, దేమకేతేపల్లి రామమూర్తి, రాష్ట్ర మహిళా విభాగ్ కార్యదర్శి చుండుపల్లి గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

బుక్కపట్నం : మండల పరిధిలోని గునిపల్లి సమీపంలోని హంద్రీనీవా కాలవ బ్రిడ్జిపై అతివేగంతో బస్సు ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ద్విచక్రవాహనదారుడు మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ నరసింహుడు తెలిపిన వివరాలు.. కృష్ణాపురం గ్రామానికి చెందిన శ్రీనాథ్ (42) పుట్టపర్తి నుంచి సొంత గ్రామానికి వెళ్తున్న ద్విచక్రవాహనంలో వెళుతున్నాడు. ముదిగుబ్బ నుంచి బుక్కపట్నం వస్తున్న ఆర్టీసీ బస్సు హంద్రీనీవా కాలువ బ్రిడ్జిపై అతివేగంగా వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన శ్రీనాథ్‌ను కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్

గాండ్లపెంట : పదో తరగతి పరీక్షలు జరుగుతున్న సమయంలో పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఎస్ఐ బి. మల్లికార్జున్ రెడ్డి తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో. కట్టారుపల్లి క్రాస్ వద్ద ఉన్న కేజీబీ పాఠశాలలో. పరీక్షలు కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు. ఈ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉందని ఆయన తెలిపారు.

కొత్తచెరువు : సోమవారం నుండి పదవ తరగతి పరీక్షలు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు నిర్ణీత గడువులోపు చేరుకోవాలని ఎస్ఐ లింగన్న, ఎంఇఒ వెంకటరమణ నాయక్ తెలిపారు. పరీక్షాకేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. రెండు కేంద్రాల్లో 440 మంది పరీక్షలు రాయనున్నారన్నారు.

ఓబుల దేవర చెరువు : పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద ఆంక్షలు విధించినట్లు నల్లమడ సిఐ నిరంజన్ రెడ్డి, ఎస్ఐ గోపీ తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించామన్నారు. విద్యార్థులు పరీక్షా సమయానికి ముందే పరీక్ష కేంద్రం చేరుకోవాలన్నారు.

బాణసంచా పేలి ఐదుగురికి గాయాలు

బత్తలపల్లి : టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్రలో అపశృతి చోటు చేసుకుంది. తెలుగు తమ్ముళ్ల అత్యుత్సాహం వల్ల పటాసులు పేలి ఐదుగురు తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలోని పోట్లమర్రి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. బత్తలపల్లి మండలం పోట్లమర్రి గ్రామంలోకి నారా లోకేష్ పాదయాత్ర చేరుకోగానే ముందుగా వస్తున్న వాహనంలో నుంచి నాయకులు, కార్యకర్తలు పటాసులు కిందకు వేసుకుంటూ వెళ్లారు. అనంతరం తెలుగు తమ్ముళ్లు వాటిని కాల్చుకుంటూ వస్తున్నారు. గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఓ పటాసును కాల్చగా ఆది పైకి వెళ్లి పేలకుండ కిందనే పేలింది. అది జనంలోకి వెళ్లి పేలడంతో ఐరుగురు గాయపడ్డారు. వారిలో చిన్నపరెడ్డిపల్లికి చెందిన రత్నమ్మ ఐదు సంవత్సరాల వయస్సున్న నిదర్శన్, తోపుదుర్తికి చెందిన వాణిశ్రీ, చెన్నేకొత్తపల్లికి చెందిన నరసింహులుగాయపడ్డారు. స్థానికుల సమాచారం ఇవ్వడంతో 108 వాహనంలో క్షతగాత్రులను బత్తలపల్లి ఆర్టీటి ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స అనంతరం వారు తమ స్వగ్రామాలకు వెళ్లిపోయారు.

లోకేష్‌ను కలిసిన మైనార్టీ నాయకులు

కొత్తచెరువు : యువగళం పాదయాత్ర ధర్మవరంలో కొనసాగిన సందర్భంగా కొత్తచెరువు మండల టిడిపి మైనార్టీ విభాగపు అధ్యక్షులు సైకిల్‌షాప్ బాబా నారా లోకేష్ ను కలిశారు. ఈసందరభంగా బాబా మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుండి టిడిపి అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. గత ఎన్నికల్లో మైనార్టీలు అధిక సంఖ్యలో వైసిపి ప్రభుత్వానికి ఓటు వేసినా కూడా ఎలాంటి న్యాయం జరగలేదన్నారు తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే మైనార్టీలకు పెద్దపీట వేయాలని లోకేష్‌ను కోరనట్లు చెప్పారు.

పుట్టపర్తిలో ఘర్షణలకు పాల్పడడం తగదు

కొత్తచెరువు : ప్రశాంతంగా ఉన్న పుట్టపర్తిలో వైసిపి టిడిపి నాయకులు ఘర్షణలకు పాల్పడుతూ ఆ శాంతి వాతావరణం కల్పించడం తగదని జనసేన పార్టీ మండల కన్వీనర్ పూల శివప్రసాద్ అన్నారు. ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి కక్షలు కార్పన్యాలు పెంచి పోషిస్తున్నారని విమర్శించారు. సత్తెమ్మ దేవాలయం లోకి రాళ్లు చెప్పులు విసురుకొని అక్కడ అశాంతి వాతావరణం సృష్టించారన్నారు. ఇక్కడికి దేశ విదేశాల నుండి అధిక సంఖ్యలో భక్తులు వస్తుంటారనిఇలాంటి సంఘటనలు జరగడం ద్వారా వారి మనోభావాలు దెబ్బతింటాయని అన్నారు.

స్థల పరిరక్షణ హామీపై హర్షం

కదిరి టౌన్ : కదిరి నియోజకవర్గంలోని పట్ర కులస్తుల సంక్షేమం కోసం కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకు కొరకు గత ప్రభుత్వ హయాంలో కదిరి రూరల్ కుమ్మరవాండ్ల పల్లెలో కేటాయించిన స్థలాన్ని పరిరక్షించడానికి స్థానిక ఎమ్మెల్యే హామీ ఇచ్చినందుకు ఆసంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. పట్రా సంక్షేమ సంఘం కోసం కేటాంచిన కమ్యూనిటీ స్థలాన్ని స్థానికులు కొంతమంది ఆక్రమించుకోవడానికి గత మూడు రోజులుగా ప్రయత్నిస్తుండగా సమస్యను ఎమ్మెల్యే డాక్టర్ సిద్ధారెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. స్పందించిన ఆ స్థలాన్ని పరిశీలించి పట్రా కులస్తులకు తప్పకుండా కేటాయిస్తామని హామీ ఇచ్చారన్నారు.

'పది' విద్యార్థులకు ఉచిత ప్రయాణం

హిందూపురం : సోమవారం నుండి 18 వ తేదీ వరకు జరిగే 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణం ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. పదవ తరగతి పరీక్షలు జరుగు తేదీలలో హాల్ టిక్కెట్ కలిగిన విద్యార్థులను వారి నివాస స్థలం నుండి పరీక్షా కేంద్రానికి రాను పోను అన్ని పల్లెవెలుగు బస్సులలో ఉచితంగా అనుమతించనున్నట్లు చెప్పారు. బస్ పాస్ లేని విద్యార్థులను కూడా కేవలం హాల్ టిక్కెట్ తో అనుమతిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ కోరారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎఎస్‌డబ్ల్యూ

ప్రతిభా విద్యార్థులకు నగదు బహుమతి

చిలమత్తూరు : స్థానిక బిసి హాస్టల్ లోని పది విద్యార్థుల్లో 500 కన్న ఎక్కువ మార్కులు తెచ్చుకున్న ప్రతి విద్యార్థికి తాను సొంతంగా రెండువేల రూపాయలు ప్రోత్సాహకం ఇస్తానని బిసి హాస్టల్ ఎఎస్‌డబ్ల్యూ నాగేంద్ర రాజు తెలిపారు. ఈ మేరకు ఆదివారం మండల కేంద్రంలోని స్థానిక బిసి బాలుర వసతి గృహాన్ని ఆయన సందర్శించి పది విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. పదిలో హాస్టల్ విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డన్ ఓబుళ రెడ్డి, ఓబుళేసు తదితరులు పాల్గొన్నారు.

నేడు ధర్మవరంలో 36 గంటల చేనేత దీక్ష ప్రారంభం

ధర్మవరం : చేనేత సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే కార్యక్రమంలో భాగంగా సోమవారం ధర్మవరంలో ఆంధ్ర ప్రదేశ్ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో 36 గంటల చేనేత దీక్షను ప్రారంభిస్తున్నట్లు చేనేత కార్మికసంఘం ప్రధాన కార్యదర్శి పామిశెట్టి గోవిందు తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించే ఈ దీక్షకు మద్దతుగా అనంతపురంలో ఉన్న చేనేత కార్మికులు హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు. .

సన్మానం

ప్రజాశక్తి - కదిరి టౌన్

వైసిపి రాయలసీమ బీసీ సెల్ రీజనల్ కోఆర్డినేటర్‌గా ఎన్నికైన రమేష్ గౌడ్ మొదటిసారిగా కదిరి నియోజకవర్గానికి వచ్చిన సందర్భంగా ఆదివారం కుమ్మరవాండ్లపల్లి కార్యాలయంలో ఆయనను ఘనంగా సన్మానించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తల హరి ప్రసాద్ ఆదేశాల మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో రమేష్ గౌడ్ మాట్లాడుతూ పన్నెండు సంవత్సరాలుగా బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం కృషి చేసిన తనను జగన్మోహన్ రెడ్డి గుర్తించి ఈ పదవి ఇచ్చినందుకు ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు బత్తల వెంకటరమణ, లింగాల లోకేశ్వర్ రెడ్డి, బాహుద్దీన్, సంపంగి గోవర్ధన్, నరసింహ గౌడ్, రామ్మోహన్ గౌడ్, ముబారక్,పవన్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రమష్ గౌడ్‌ను సన్మానిస్సు నాయకులు

బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయండి

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో గల శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహోత్సవాలు ఏప్రిల్ 27వ తేదీ నుండి మే 7వ తేదీ వరకు నిర్వహిస్తామని ఈ ఉత్సవాలను విజయవంతం చేయాలని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ చైర్మన్ దాశెట్టి సుబ్రహ్మణ్యం కోరారు. ఈ సందర్భంగా వారు ఆలయంలో బ్రహ్మోత్సవాల నిర్వహణపై సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా దాశెట్టి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మే మూడవ తేదీ రథోత్సవ కార్యక్రమం ఉంటుందన్నారు. ఏర్పాట్ల విషయంపై మాట్లాడుతూ ఇప్పటి నుంచే పనులు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ కుండా చౌడయ్య, ఆలయ ఈవో వెంకటేశులు, ఆలయ మేనేజర్ రామశాస్త్రి, ఆలయ అర్చకులు కోనేరా చార్యులు, మకరంద బాబు, భాను ప్రకాష్, పాలకవర్గ సభ్యులు, దాతలు, ఉభయ దాతలు తదితరులు పాల్గొన్నారు.

పిఇటిల జిల్లా నూతన కార్యవర్గం ఏర్పాటు

ప్రజాశక్తి - కొత్తచెరువు

శ్రీ సత్యసాయి జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల (పిఇటిల) నూతన కార్యవర్గాన్ని ఆదివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నట్లు ఉమ్మడి జిల్లా పిఇటిల సంఘం అధ్యక్షులు మురార్జి యాదవ్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ వ్యాయామ ఉపాధ్యాయ సంఘం వైస్ ప్రెసిడెంట్ ఎల్. నాగరాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అధ్యక్షులుగా చోళ సముద్రం పీడీ శివకుమార్ ను, కార్యదర్శిగా తలమర్ల పీడీ వెంకటేష్‌ను ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా రామకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రవీంద్ర నాయక్,వైస్ ప్రెసిడెంట్లుగా రాజేష్, రమేష్, వెంకటరమణ నాయక్, జాయింట్ సెక్రటరీలుగా నరసింహమూర్తి, సూర్యనారాయణ, శివకుమార్, కోశాధికారిగా రామకృష్ణను ఎన్నుకున్నారు.

మోడీ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న రామచంద్రయ్య

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

ప్రధాని మోడీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయడానికి సిద్ధం కావాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రామచంద్రయ్య పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సాయి ఆరామం అతిథి గృహంలో ఆ పార్టీ జిల్లా కార్యవర్గ కౌన్సిల్ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తున్నాయన్నారు. రాహుల్ గాంధీని ఎంపీగా అనర్హత వేటు వేసి రెండేళ్లపాటు జైలు శిక్ష విధించడం చాలా దారుణమన్నారు. దేశంలో నేడు మహిళలపై మైనార్టీలపై దాడులు జరుగుతున్నాయని వాటిని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. వీటిని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ఈనెల 14 నుంచి 30 వరకు సిపిఐ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్రలు చేపడుతున్నామన్నారు. కేంద్ర బడ్జెట్ లో ఏపీకి సవతి ప్రేమ చూపి అరకొర నిధులు కేటాయించడం అన్యాయమన్నారు. జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ మాట్లాడుతూ, పుట్టపర్తి పవిత్రతను ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి మంట కలిపారని 30 పోలీస్ యాక్ట్ ఉన్న ఇలా జరగడం పోలీసుల వైఫల్యమే అని విమర్శించారు. ఈ సమావేశం లో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కాటమయ్య, అనుబంధ సంస్థల నాయకులు సురేంద్ర, జింకా చలపతి, బయన్న, నియోజకవర్గ కార్యదర్శి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి సంఘటనకు వైసిపిదే బాధ్యత : పల్లె

పుట్టపర్తి అర్బన్ : పుట్టపర్తిలో శనివారం జరిగిన సంఘటనకు వైసిపి పూర్తి బాధ్యత వహించాలని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం ప్రకటన విడుదల చేశారు. శనివారం జరిగిన సంఘటనలో నిజా నిజాలు వివరించాల్సిన బాధ్యత తనమీద ఉందన్నారు. యువగళం పాదయాత్రలో లోకేష్ ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి అవినీతిపై ప్రస్తావించిన అంశాలన్ని వాస్తవాలేనన్నారు. ఎమ్మెల్యే నే మొదటి సవాలు చేశారని, అందుకు తాము సవాలు చేశానని చెప్పారు. పోలీసులు తనను తననాయకులను టిడిపి కార్యాలయంలో నిర్బంధించి, ఎమ్మెల్యేని మాత్రం విడిచిపెట్టారన్నారు. పుట్టపర్తి ఎమ్మెల్యే తన ఆఫీసు ముందు వెళ్తూ తనపై అనుచిత వ్యాఖ్యలు చేసి తనను రెచ్చగొట్టే విధంగా ప్రవర్తించారన్నారు. దాంతో తాను సత్యమ్మ గుడి వద్దకు వెళ్లానని, అంతే తప్ప నా తప్పు ఏమీ లేదని పల్లె వివరించారు. అక్కడే ఉన్న వైసిపి నాయకులు తనపై రాళ్లతో దాడికి పూనుకొన్నారని, తన కారు అద్దాలు ధ్వంసం అయినాయ్యయని అన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా టిడిపి పుట్టపర్తి పవిత్రతను కాపాడుతుందని హామీ ఇచ్చారు.

చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళదాం : ఎమ్మెల్యే

పుట్టపర్తి అర్బన్ : వైసిపి ప్రభుత్వం నాలుగేళ్లలో నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళదామని శాసనసభ్యుడు దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఆ పార్టీ కార్యాలయంలో వైసిపి విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏయే అభివృద్ధి పనులకు ఎప్పుడు జీవోలు తెచ్చిందీ, చేపట్టిన పనులు గురించి జీవో ప్రతులను ఇస్తామని ఇదే విషయాన్ని గ్రామాల్లో రచ్చకట్ట దగ్గర ప్రజలతో చర్చించాలని నాయకులకు సూచించారు. శనివారం పట్టణంలో సత్యమ్మ గుడి దగ్గర జరిగిన సంఘటన దురదృష్టకరమని, గ్రామాల్లో ఎలాంటి కవ్వింపు చర్యలకు పోకుండా చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఓబుళపతి, వైస్ చైర్మన్లు తిప్పన్న, శ్రీలక్ష్మి, పుడా చైర్‌పర్సన్ లక్ష్మీ నరసమ్మ, ఎంపీపీ ఎవి రమణారెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, కన్వీనర్ రంగారెడ్డి, నాయకులు లోచర్ల విజయభాస్కర్ రెడ్డి, గంగాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - గాండ్లపెంట

మండల పరిధిలోని కట్టారుపల్లి పంచాయతీలోని శ్రీ యోగి వేమన బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం రాత్రి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. చుట్టుపక్కల గ్రామాల వారు ఇంటి నుంచి ఉడికిన పెట్టిన జొన్నలు తీసుకొచ్చి ఆలయం వద్ద కుంభం పోసి శక్తి పూజ నిర్వహించారు. ఉత్సవాలకు వచ్చిన భక్తులకు తాగునీరు, వైద్యం, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈసందర్భంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా కదిరి సిఐ శంకర్ నాయక్, ఎస్ఐ మల్లికార్జున్ రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

సామంత రాజ్యాలుగా పురపాలక వార్డులు

కౌన్సిలర్లే కిరీటం లేని రాజులు

ప్రజాశక్తి-హిందూపురం

అధికార పార్టీ అండతో కౌన్సిలర్లు, ఆ పార్టీ నాయకులు చెలరేగి పోతున్నారు. తమ వార్డుల పరిధిలో తమకు తెలియకుండా ఏదీ చేయరాదంటు అదేశాలు ఇస్తున్నారు. సంబంధింత వార్డు సచివాలయాల్లో వారికి ఏపనైనా తెలయకుండా జరిగినా, మున్సిపల్ అధికారులు సందర్శించిన ఇక వారు అంతే... పునకం వచ్చినట్లు కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తారు. నోటికి పని చెప్పి చెప్పుకోలేనంత రీతిన అధికారులపై విరుచుకుపడతారు. మరీ కాస్తా మాట జరిగే నాయకులు, కౌన్సినర్లు అధికారులను బదలీ చేయించడం సైతం ఇక్కడ రివాజుగా మారింది. మరి కొంత మంది కౌన్సిలర్లు అయితే తమ పార్టీ అధికారంలో ఉందని, తాము చెప్పినట్లు వినాల్సిందే అని హుకుం జారీ చేస్తున్నారు. అలా వినక పోతే ఇక్కడి నుంచి వెళ్లి పోవాలంటు ఖరాఖండిగా చెప్తున్నారు. దీంతో మూడేళ్లల్లో ముగురు కమిషనర్లు బదలీ కాగా ముగ్గరు ఇన్‌చార్జ్ కమిషనర్లుగా ఇక్కడ విధులు నిర్వర్తించారు.ఇటీవల కమిషనర్ సైతం బదలీ అయ్యారు.

హిందూపురం పురపాలక సంఘం అన్నది ఒక రాజ్యం. వార్డులు అంటే సామంత రాజ్యాలు, తామే కిరీటం లేని రాజులని అధికార పార్టీ కౌన్సిలర్లు అనుకున్నట్లు ఉన్నారు. వార్డులో జరిగే ప్రతి విషయంతో పాటు అభివృద్ధి పనుల నుంచి కనీసం వార్డులో అధికారులు పర్యటించాలన్న వారి అనుమతులు తీసుకోవాల్సిందే. లేదంటే పూనకం వచ్చినట్లు ఊగిపోతారు. గతంలో సాక్షత్తు మున్సిపల్ కమిషనర్ నూతనంగా నిర్మాణం చేస్తున్న వాణిజ్య భవనాన్ని పరిశీలనకు వెళితే ఆ వార్డు కౌన్సిలర్ భర్త సచివాలయ ఉద్యోగులు సమచారం ఇవ్వలేదంటూ వారిపై ఆగ్రహం వ్యక్తం చేసి, సచివాలయానికే తాళం వేసిన ఘటన చోటు చేసుకుంది. దీంతో ఏమి చేయలేని అధికారులు వీరి వింత పోకడలకు తలలు పట్టుకుంటున్నారు. అధికార కార్యక్రమాలు, ప్రవేటు కార్యక్రమాల నుంచి ఆధ్యాత్మిక కార్యక్రమాలు, చివరికి పోలీస్ స్టేషన్‌లో వివిధ కేసుల్లో పట్టుపడిన వాహనాలను పోలీసులు వేలం వేయాలన్నా కౌన్సిలర్లకు తెలపాలంటున్నారు. సమాచారం ఇవ్వకుంటే ఆ కార్యక్రమాలకు అడ్డుపడుతున్నట్లు సమాచారం. దీంతో అధికారులు, ప్రజలు అసహనానికి గురవుతున్నారు. వార్డు కౌన్సిలర్లకు తెలిపే విషయాలైతే తెలుపుతామనిఅనవసర విషయాలు ఎందుకు చెప్పాలని వారు వ్యాఖ్యానిస్తున్నారు. అధికార పార్టీలో నెలకొన్న విబేధాలతో ఈ సమస్యలు మరింత జఠిలమవుతున్నట్లు తెలుస్తోంది. ఇక కౌన్సిల్ సమావేశంలో అధికారులు అభివృద్ధిపై రూపొందించిన అజెండాపై కనీస చర్చ సైతం జరపరు. క్షణాల్లో అజెండాకు అమోదం తెలిపి, అనవసర వివిషయాలపై అధికార, ప్రతి పక్ష కౌన్సిలర్లు ఒకరిపై ఒకరు దూషించుకుంటు మధ్యలోనే సమావేశం ముగించి వెళ్లి పోతుంటారు. తమకు అనుకూలంగా ఉన్న అంశాలు అయితే అధికారులపై ఒత్తిడి తెచ్చి, అజెండాలో పొందపరచి, వాటిని వెంటనే ఆమోదం తెలుపుతారన్న విమర్శలున్నాయి. దీనికి నిదర్శనం గడువు ముగిసిన ఆరు నెలలకు, ఇంకా గడువు ఉండగానే కర్నాటక రాష్ట్రానికి చెందిన వ్యక్తికి ఇచ్చిన సామూహిక మరుగుదోడ్లతో పాటు కూరగాయాల హోల్ సేల్ వ్యాపారులకు, పూల వ్యాపారులకు పురపాలక సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మాణం చేసిన వాణిజ్య భవనం కింద పూల వ్యాపారులకు కేటాయించిన స్థలాలే. ఇందులో రూ. కోట్లు ముడుపుల రూపంలో తీసుకున్నట్లు పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. వీటితో పాటు వార్డులో ఎవరైన నూతనంగా గృహం నిర్మించుకోవాలంటే వారి వార్డు రాజును ప్రసన్నం చేసుకోవాల్సిందే. ఇక సచివాలయ ఉద్యోగులైతే మరింత వేదనకు గురవుతున్నట్లు తెలుస్తోంది. సచివాలయంలో ప్రతి కార్యదర్శి వీరి అనుమతి లేకుండా ఏమి చేయడానికి వీల్లేదు. అర్జులు కార్యాలయాల చుట్టు తిరిగి, విసిగి పోకూడదని ప్రభుత్వం గ్రామ వార్డు సచివాలయాలను ఏర్పాటు చేసి, సుపరిపాలన అందిస్తున్న తరుణంలో కొంత మంది అదే పార్టీకి చెందిన కౌన్సిలర్లు ఇలా వ్యవహరించడం విడ్డూరంగా ఉంది.



హిందూపురం పురపాలకసంఘం కార్యాలయం